సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 2 । మార్చి । 2024



రూ.51 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి సలాది శ్రీనివాస్ దంపతులు (కపిలేశ్వరపురం) శుక్రవారం రూ.51 వేల విరాళం సమర్పించారు.




రామకృష్ణారెడ్డివి 'ఉనికి'పాట్లు

మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉనికి చాటుకోవడానికే అనేక ఫీట్లు చేస్తున్నారని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు.

II లో

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది.

దీవెనలందుకున్నారు



విద్యార్థులకు నమూనా చెక్ అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

- జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల
- జిల్లాలో 31,926 మందికి లబ్ధి
- విద్యార్థులు, తల్లుల జాయింట్ ఖాతాల్లో రూ.24.09 కోట్ల జమ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): విద్యార్థులు విద్యా 'దీవెన'లందుకున్నారు.. తమ చదువు నిరాటంకంగా సాగుతుందనే ధీమా పొందారు.. తమ బిడ్డలు ఇక నిశ్చింతగా చదువుకుని, ప్రయోజకులై, మంచి ఉద్యోగాలు సంపాదించుకుని, తమ కుటుంబాలను ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకువస్తారని తల్లిదండ్రులు కూడా భరోసా పొందారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువూ మధ్యలోనే ఆగిపోరాదని.. వారు కూడా పెద్ద చదువులు చదవాలనే సమున్నత లక్ష్యంతో.. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన (పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్) పథకం అమలు చేస్తోంది. దీని ద్వారా ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదువుతున్న పేద పిల్లలు తమ కళాశాలలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని ప్రతి త్రైమాసికం ముగిసిన వెంటనే అందిస్తోంది. ఈ పథకం లబ్ధిదారులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందాన్ని నింపుతోంది.

కృష్ణా జిల్లా పామర్రులో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా దీవెన నిధులను ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా విద్యార్థులు, వారి తల్లుల జాయింట్ ఖాతాల్లో జమ చేశారు. ఇదే సమయంలో కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల కార్యక్రమంలో కలెక్టర్ కె.మాధవీలత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ పథకం కింద జిల్లాలోని 31,926 విద్యార్థులకు రూ.24.09 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. జిల్లా పరిధిలో 28,730 మంది తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో ఈ సొమ్ము జమ చేశారని తెలిపారు. 2022-23కు సంబంధించి జగనన్న విద్యా దీవెన కింద నాలుగు విడతల్లో ప్రభుత్వం రూ.92.18 కోట్లు అందించిందని తెలిపారు. విద్యా దీవెన పథకం ద్వారా హాజరు శాతానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా చదువు పట్ల విద్యార్థులు, పాటు వారి తల్లిదండ్రుల్లో అంకిత భావం కలిగిస్తోందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ మాధవీలత జగనన్న విద్యా దీవెన పథకం నమూనా చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ అధికారులు ఎం.సందీప్, కేఎస్ జ్యోతి, పీఎస్ రమేష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మండలాలవారీగా జగనన్న విద్యా దీవెన

మండలం	విద్యార్థులు	లబ్ధి (రూ.)
అనపర్తి	1,073	81,18,276
బిక్కవోలు	1,218	90,53,577
చాగల్లు	1,186	92,18,012
దేవరపల్లి	1,356	1,00,90,726
గోకవరం	874	56,84,116
గోపాలపురం	990	72,89,511
కడియం	1,646	80,62,073
కోరుకొండ	1,177	80,62,076
కొవ్వూరు	1,225	94,30,593
కొవ్వూరు (అర్బన్)	713	52,84,667
నల్లజర్ల	1,326	1,03,92,710
నిడదవోలు	1,459	1,12,40,109
నిడదవోలు (అర్బన్)	768	63,56,325
పెరవలి	1,330	1,00,05,386
రాజమహేంద్రవరం అర్బన్	5,777	4,48,23,768
రాజమహేంద్రవరం రూరల్	3,444	2,54,87,929
రాజానగరం	1,751	1,25,38,403
రంగంపేట	1,056	71,87,403
సీతానగరం	1,115	83,64,098
తాళ్లపూడి	942	73,18,190
ఉండ్రాజవరం	1,500	1,26,26,937

ఎంతో ఉపయోగపడుతుంది



జగనన్న విద్యా దీవెన ఆర్థిక సహాయం నా చదువులకు ఎంతో ఉపయోగపడుతోంది. పదో తరగతి చదివినప్పుడు జగనన్న అమ్మ ఒడి నిధులు ఇచ్చారు. ఇప్పుడు డిగ్రీ చదివేందుకు జగనన్న విద్యా దీవెన అందజేస్తూ సీఎం జగన్ ఎంతో మేలు చేకూరుస్తున్నారు. గతంలో ప్రభుత్వ స్కూళ్లలో ఎటువంటి సదుపాయాలూ అందుబాటులో ఉండేవి కావు. నేడు జగనన్న వచ్చాక నాడు - నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశారు. స్కూళ్లలో కొత్త నిర్మాణాలు చేపట్టారు. ఉపాధ్యాయులను నియమించారు. మెరుగైన బోధన పద్ధతులు అమలు చేస్తూ ఉన్నత చదువులకు అన్ని విధాలా భరోసా కల్పిస్తున్నారు.

– **కుండ్ల క్రాంతికుమార్**, ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి, లంకపాకల, రంపచోడవరం

పేద కుటుంబాలకు మేలు



జగనన్న విద్యా దీవెన పథకం వల్ల నాలాంటి పేద కుటుంబాల విద్యార్థులు నిశ్చింతగా చదువుకోగలుగుతున్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– **గుత్తాల లక్ష్మి**, ఆర్ట్స్ కాలేజీ విద్యార్థిని, తాండవపల్లి, కోనసీమ జిల్లా

4న వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావం

- సుబ్రహ్మణ్యం మైదానంలో సభ
- ముఖ్య అతిథులుగా కొడాలి, పేర్ని, వల్లభనేని



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని సుబ్రహ్మణ్యం మైదానంలో 'రాజమహేంద్రవరం సిద్ధం' పేరిట ఎన్నికల శంఖారావం పూరించనున్నట్టు స్థానిక ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. నగరంలోని మార్గాని ఎస్టేట్స్‌లోని తన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 42 మంది డివిజన్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ శ్రేణులంతా సమరోత్సాహంతో ఎన్నికల శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ పాలనలో నగరాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేశామని చెప్పారు. కరోనా కారణంగా రెండున్నరేళ్లు వృథా అయినా మిగిలిన రెండున్నరేళ్లలో చేసినంత అభివృద్ధిని సిటీ నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఏ ప్రభుత్వమూ చేయలేదని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేసినన్ని సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన ఈ ఐదేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ విధానంలో పేదలకు నేరుగా రూ.3 లక్షల కోట్లు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ నేతలు తమ ఖజానా నింపుకోవడానికే తప్ప ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. అసలు టీడీపీకి ప్రజల వద్దకు వచ్చి ఓటు అడిగే హక్కు లేదని భరత్‌రామ్ అన్నారు. టీడీపీ స్థానిక నేతల్లో ఒక కుటుంబం మూడు పదవులు అనుభవించిందని, రాజకీయాలను, అధికారాన్ని అడ్డం పెట్టుకుని డబ్బు సంపాదించడమే వారికి తెలుసని అన్నారు. ఇవన్నీ ప్రజల ముందుకు తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని భరత్‌రామ్ అన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, సిటీ అబ్జర్వర్ రావిపాటి రామచంద్రరావు, గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మహిళా విభాగం అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, మాజీ కార్పొరేటర్లు పోలు విజయలక్ష్మి, అర్జరపు వాసు తదితరులు పాల్గొన్నారు.

4న జాబ్‌మేళా



కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పీడీ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్(ఆపిల్ మొబైల్ మాన్యుఫ్యాక్చరింగ్)లో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, మెరైన్ ఫుడ్ కంపెనీలో సీనియర్ అకౌంటెంట్, ఒప్పో మొబైల్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, భారత్ ఫోర్డ్ కంపెనీలో టెక్నీషియన్, బృందావన్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, పీఆర్ఓ, నిట్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఈ మేళా జరుగుతుందని వివరించారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు వారు ఈ పోస్టులకు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం, ఉద్యోగాన్ని బట్టి భోజనం, వసతి, రవాణా సౌకర్యాలుంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు సోమవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలని లచ్చారావు సూచించారు.

సైబర్ క్రైమ్ పేరుతో వైద్యురాలికి టోకరా

- రూ.6.67 లక్షలకు ఎసరు
- రాజమహేంద్రవరంలో ఘటన

రాజమహేంద్రవరం రూరల్: సైబర్ క్రైమ్ పేరుతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలోని వైద్యురాలి నుంచి రూ.6.67 లక్షలకు టోకరా వేసిన సంఘటన రాజమహేంద్రవరంలో చోటుచేసుకుంది. దీనిపై శుక్రవారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక దేవీ చౌక్ సెంటర్‌లోని బుద్ధుడు ఆసుపత్రిలో వైద్యురాలు సజ్జా శ్వేతకు గత నెల 26న ఫీడెక్స్ కొరియర్ ముంబాయి నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. మీ పేరుపై కొరియర్ వచ్చిందని, అందులో డ్రగ్స్ ఉన్నాయట సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారని సదరు వ్యక్తి చెప్పి ఫోన్ పెట్టేశాడు. మరి కొద్ది సేపటికి సైబర్ క్రైమ్ పోలీసులమంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి మీ పేరు మీద వచ్చిన కొరియర్‌లో డ్రగ్స్ ఉన్నాయని, మీ దగ్గరకు వచ్చి ఇంటిని సోదా చేసి అరెస్టు చేయాల్సి ఉంటుందని అర గంట పాటు ఆ వైద్యురాలిని బెదిరించాడు. ఎటువంటి కేసు లేకుండా చేయాలంటే రూ.6.67 లక్షలు వెంటనే బ్యాంకు అకౌంట్‌లో వేయాలని అన్నాడు. దీంతో డాక్టర్ శ్వేత సదరు అకౌంట్‌లో బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రూ.6.67 లక్షలను అతని అకౌంట్‌లో వేశారు. తర్వాత నుంచి ఎటువంటి ఫోన్లూ రాకపోవడంతో అనుమానం వచ్చి మోసపోయానని గ్రహించి త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఎస్సై రంగనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లాలోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 5 నుంచి 25వ తేదీ వరకూ సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు సమీప ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక దక్షిణ మండల పోలీస్ జోన్‌లోని రాజమహేంద్రవరం రెండో పట్టణ, ధవళేశ్వరం, కడియం పోలీస్ స్టేషన్ల పరిధిలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ ఈ నెల 31వ తేదీ వరకూ అమలులో ఉంటుందని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీని ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అటువంటివి జరపడానికి రాజమహేంద్రవరం దక్షిణ మండల పోలీసు జోన్ డీఎస్పీ వద్ద ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మానవత్వం చాటుకున్న మంత్రి వనిత



క్షతగాత్రుడు వెంకట్రావుకు ధైర్యం చెబుతున్న మంత్రి వనిత

దేవరపల్లి: రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత మానవత్వాన్ని చాటుకున్నారు. దేవరపల్లి మండల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆమె లక్ష్మీపురం నుంచి గౌరీపట్నం వెళ్తున్నారు. మార్గం మధ్యలో దుద్దుకూరుకు చెందిన క్వారీ కార్మికుడు లింగాల వెంకట్రావు ప్రమాదానికి గురై పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి, క్షతగాత్రుడి వద్దకు వెళ్లి, పరామర్శించి, ధైర్యం చెప్పారు. తన కాన్వాయ్ వాహనంలో ఆసుపత్రికి తరలించి వైద్యం అందించి, కుటుంబ సభ్యులకు అప్పగించాల్సిందిగా వ్యక్తిగత, భద్రతా సిబ్బందిని ఆదేశించారు. క్షతగాత్రుడు వెంకట్రావు బైక్‌పై క్వారీ నుంచి దుద్దుకూరు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం. దేవరపల్లి ఎస్సై కె.శ్రీహరిరావు తన సిబ్బందితో క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. మానవత్వం చాటుకున్న మంత్రి వనితను అక్కడి ప్రజలు అభినందించారు.

16న లోక్ అదాలత్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను 16వ తేదీకి మార్చినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లోనూ అన్ని రకాల సివిల్, ప్రీ లిటిగేషన్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రజలు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

తొలి రోజు 80.22 శాతం పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని వలంటీర్లు శుక్రవారం తెల్లవారుజామునే ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 2,44,730 మంది పింఛన్‌దార్లకు ప్రభుత్వం రూ.72.66 కోట్లు మంజూరు చేసింది. అనారోగ్యంతో ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి కూడా వలంటీర్లు నేరుగా వెళ్లి పింఛన్లు అందజేశారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు 1,96,314 మందికి (80.22 శాతం) రూ.58.24 కోట్ల నగదు అందజేశారు. పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలోనే జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లాలో 87.58 శాతంతో ఉండ్రాజవరం మండలం మొదటి, 66.07 శాతంతో కొవ్వూరు అర్బన్ చివరి స్థానాల్లో నిలిచాయని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ మూర్తి తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



రాజమహేంద్రవరంలోని శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో పరీక్షలు రాసేందుకు వస్తున్న విద్యార్థినులు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లావ్యాప్తంగా 52 కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 19,737 మందికి గాను 19,309 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఇంటర్మీడియెట్ విద్యా మండలి జిల్లా పర్యవేక్షణాధికారి నరసింహ తెలిపారు. 428 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ విభాగంలో 2,001 మందికిగాను 1,851 మంది పరీక్ష రాశారని, 150 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదని తెలిపారు.

ఎన్నికల బృందాలకు శిక్షణ పూర్తి

కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికల ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఆయా బృందాలకు శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత అన్నారు. వెలగపూడి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాల కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, కమిషనర్ కె.దినేష్‌కుమార్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, డీఆర్ఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో జనవరి 22న తుది ఓటర్ల జాబితా ప్రకటించారని, అప్పటికి పెండింగ్ దరఖాస్తులు 5,506 ఉన్నాయని తెలిపారు. తర్వాత కొత్తగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి 46,091 దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 9,015 దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మధ్య, చిన్న తరహా, సూక్ష్మ పరిశ్రమలను గుర్తించి, చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వ ర్యాంప్ పథకంతో ఏకీకృతం చేయడం ద్వారా జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. దీనికి సంబంధించిన సర్వే యాప్‌ను కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పారిశ్రామికాభివృద్ధికి ఎంఎస్ఎంఈలను గుర్తించి, అభివృద్ధి చేసేందుకు ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే స్కీము ప్రకటించిందని తెలిపారు. దీనికోసం ఎంఎస్ఎంఈలపై జిల్లావ్యాప్తంగా 20 రోజులు సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సర్వే ద్వారా సేకరించిన డేటాను డిజిటల్ ప్లాట్‌ఫాంలోనికి తీసుకునివచ్చి ఏపీఎంఎస్ఎంఈవన్ పోర్టల్‌కు అనుసంధానం చేస్తారని వివరించారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి **ఆదికవి నన్నయ** యూనివర్సిటీలో రిసెప్షన్ సెంటర్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత శుక్రవారం పరిశీలించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్, నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులతో కలిసి ముందస్తు ఏర్పాట్ల రోడ్ మ్యాప్, భద్రత ఏర్పాట్లను పరిశీలించి, సూచనలిచ్చారు. పోలింగ్ అనంతరం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బ్యాలెట్ యూనిట్లను అత్యంత భద్రత నడుమ వర్సిటీలో నియోజకవర్గాల వారీగా కేటాయించిన స్ట్రాంగ్ రూములకు చేరుస్తారని వివరించారు. కౌంటింగ్ జరిగే రోజు వరకూ ఎవరు ఎటువంటి విధులు నిర్వహించాలనే విషయమై రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకుని, ట్రయల్ నిర్వహించాలని ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణకు మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. సంబంధిత రూట్ మ్యాప్‌ను కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు ఎన్.తేజ్‌భరత్, కె.దినేష్‌కుమార్, అశుతోష్ శ్రీవాత్సవ్, జి.నరసింహులు, ఎ.చైత్రవర్షిణి, ఎం.మాధురి, కేఎల్ శివజ్యోతి, ఆర్‌వీ రమణా నాయక్, ఆర్.కృష్ణనాయక్, డి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ రెడ్‌క్యాప్ రాష్ట్ర డైరెక్టర్‌గా సత్యప్రియ



సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్ రెడ్‌క్యాప్) డైరెక్టర్‌గా న్యాయవాది అంగాడ సత్యప్రియ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు వెలువరించారు. రాజమహేంద్రవరం రూరల్‌కు చెందిన సత్యప్రియ ఆవిర్భావం నుంచీ వైఎస్సార్ సీపీలో కొనసాగుతున్నారు. పార్టీ బలోపేతానికి ఆమె చేసిన సేవలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కీలక పదవిలో నియమించారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ పి.మిథున్‌రెడ్డికి సత్యప్రియ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సహకారం మరువలేనిదన్నారు. తనపై నమ్మకం ఉంచి, అత్యున్నత పదవి అందించిన సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని చెప్పారు. ఇంధన వనరుల సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి ఉంటుందన్నారు.

ఆర్‌బీకేల్లో ఈ-క్రాప్ నమోదు ముసాయిదా జాబితా

రాజమహేంద్రవరం రూరల్: రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) ఈ-క్రాప్ నమోదు ముసాయిదా జాబితాలను మూడు రోజుల పాటు ప్రదర్శిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీలో అన్ని పంటలకూ 1,81,811.85 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు జరిగిందన్నారు. ఈ జాబితాలను రైతులు పరిశీలించుకుని, ఏవైనా అభ్యంతరాలుంటే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేసి సవరించుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

నాలుగు కేజీల గంజాయి పట్టివేత


గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న పోలీసులు

గోపాలపురం: అక్రమంగా తరలిస్తున్న నాలుగు కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై కర్రి సతీష్ కుమార్ తెలిపారు. గోపాలపురం మండలం జగన్నాథపురం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా విశాఖ జిల్లా నుంచి హైదరాబాద్ వెళుతున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరి బ్యాగుల్లో నాలుగు కేజీల గంజాయి బయటపడినట్లు తెలిపారు. వీరు పోలీసుల కళ్లు గప్పి వాహనాలు మారుతూ పోలీసులకు చిక్కకుండా చెక్‌పోస్టు దగ్గరలో వాహనాల నుంచి దిగిపోయి చెక్‌పోస్టు దాటిన తర్వాత మరో వాహనంలో ఎక్కుతూ ప్రయాణిస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఈ దాడుల్లో సివిల్ సప్లై డీటీ ప్రదీప్‌కుమార్, వీఆర్వోలు నాగలక్ష్మి, మురళీకృష్ణ పోలీసులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎస్పీ జగదీష్
గోపాలపురం మండలంలోని వివిధ పోలింగ్ స్టేషన్లను శుక్రవారం ఎస్పీ పి.జగదీష్ పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

తలుపులమ్మను దర్శించుకున్న సినీనటుడు అల్లరి నరేశ్


అల్లరి నరేశ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న లోవ ఉద్యోగులు

తుని రూరల్: ప్రముఖ సినీ నటుడు అల్లరి నరేశ్ తలుపులమ్మ అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం దేవస్థానానికి సన్నిహితులతో వచ్చిన ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితులు, అర్చకులు ఆశీర్వదించారు. అల్లరి నరేశ్‌కు లోవ దేవస్థానం ఉద్యోగులు అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

అన్నవరం: సినీ నటుడు అల్లరి నరేష్ శుక్రవారం రత్నగిరి పై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు.

పరిహారం ఇవ్వాల్సిందే

- ఓఎన్‌జీసీ పనులు అడ్డుకున్న మత్స్యకారులు
- ఏటిమొగ వద్ద కార్యకలాపాల అడ్డగింపు
- హామీ ఇచ్చేవరకు తగ్గేది లేదని అల్టిమేటం
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి సంఘీభావం


మత్స్యకారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి


మత్స్యకారులు నిలువరించిన ఓఎన్‌జీసీ పైపులు

కాకినాడ: ఓఎన్‌జీసీ కార్యకలాపాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్న కాకినాడ పరిసర ప్రాంత మత్స్యకారులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిరసన గళం విప్పారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న ఈ ప్రాంత మత్స్యకారులకు న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఉద్యమిస్తామంటూ అల్టిమేటం ఇచ్చారు. దీంతో ఓఎన్‌జీసీ కార్యకలాపాలకు బ్రేక్ పడింది. వివరాల్లోకి వెళ్తే... ఓఎన్‌జీసీ, రిలయన్స్ వంటి చమురు సంస్థలు సముద్రంలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు వెలికితీసే పనులను సుదీర్ఘకాలంగా కొనసాగిస్తున్నాయి. సదరు సంస్థల కార్యకలాపాల నేపథ్యంలో సముద్ర వేటనే జీవనాధారంగా చేసుకున్న మత్స్యకారుల ఉపాధికి భంగం కలుగుతోంది. దీంతో తాళ్లరేవు, భైరవపాలెం సహా పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 65 మత్స్యకార గ్రామాలకు చమురు సంస్థలు పరిహారాన్ని అందిస్తున్నాయి. అయితే కాకినాడ ఏటిమొగ ప్రాంతం మీదుగా కార్యకలాపాలు కొనసాగిస్తూ తమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఎన్నో ఏళ్లుగా ఇక్కడి మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎటువంటి న్యాయం జరగని పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోంది.

పనులు అడ్డగించిన మత్స్యకారులు
చమురు సంస్థల నుంచి స్పందన లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా ఆగ్రహంతో రగిలిపోతున్న కాకినాడ పరిసర ప్రాంత మత్స్యకారులు శుక్రవారం నిరసన గళం విప్పారు. సముద్రగర్భంలోకి పైపులైన్లను తరలిస్తున్న సమయంలో శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఓఎన్‌జీసీకి చెందిన వాహనాలను మత్స్యకారులంతా అడ్డుకున్నారు. బార్జీపైకి పైపులైన్లు తరలిస్తున్న సమయంలో అక్కడ బార్జిలు, ఇతర వాహనాలను నిలుపు చేసి పరిహారం ఇవ్వాల్సిందేనంటూ నినదించారు. ఆ నోటా, ఈ నోటా విషయం పాక్కడంతో వందలాది మంది మత్స్యకారులు అక్కడికి తరలివచ్చి నిరసన కొనసాగించారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి సంఘీభావం
స్థానిక మత్స్యకారుల ద్వారా సమాచారం తెలుసుకున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మద్దతు ప్రకటించారు. ఈ ప్రాంత మత్స్యకారుల న్యాయసమ్మతమైన డిమాండ్‌కు తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కాకినాడ పరిసర ప్రాంత మత్స్యకారులకు పరిహారం ప్రకటించేవరకు తాను కూడా పోరాడతానని హామీ ఇచ్చారు. 2009 నుంచి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ కొంత మంది రాజకీయ నాయకుల స్వార్థం వల్ల న్యాయం జరగలేదన్నారు. సముద్రంలో రిగ్ కార్యకలాపాలు జరుగుతున్న ప్రాంతంలో ఇక్కడి మత్స్యకారులు కూడా వేటకోసం వెళ్తారని, అలాంటప్పుడు వీరికి పరిహారం ఇవ్వడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని నిలదీశారు. ఈ విషయమై మత్స్యకారులు, మత్స్యకార ప్రతినిధులు, ఓఎన్‌జీసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. అప్పటి వరకు పనులు నిలుపుదల చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏటిమొగ రేవు కాల్వ వద్ద మత్స్యకారులు టెంట్‌లు ఏర్పాటు చేసి నిరసన కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్.ఎస్.రాజు, మత్స్యకార ప్రముఖులు కాటాడి జానికిరామ్, స్థానిక నాయకులు, స్థానిక మత్స్యకార పెద్దలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డివి ఉనికిపాట్లు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజం
- మాజీ ఎమ్మెల్యే తీరును ఎండగట్టిన ఎమ్మెల్యే


వైఎస్సార్ సీపీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


ఎమ్మెల్యేకు మద్దతుగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

అనపర్తి: రాజకీయంగా నానాటికీ తీసికట్టు అన్న చందంగా తయారవుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన ఉనికిని చాటుకోవడానికే అనేక పాట్లు...ఫీట్లు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల సవాళ్లు ప్రతి సవాళ్లతో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో శుక్రవారం తనకు మద్దతుగా నియోజకవర్గంలోని పెదపూడి, బిక్కవోలు, అనపర్తి, రంగంపేట మండలాల నుంచి తన స్వగృహం వద్దకు వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ అబద్ధాలు మాట్లాడడం మాజీ ఎమ్మెల్యేకు అలవాటేనన్నారు. అనపర్తి రాజకీయ చరిత్రలో అవినీతి సామ్రాట్‌గా పేరొందిన మాజీ ఎమ్మెల్యే తన నలుపు తాను చూసుకోకుండా, నేను అవినీతికి పాల్పడ్డానంటూ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా రామకృష్ణారెడ్డి తన అవినీతితో నియోజకవర్గాన్ని పీల్చి పిప్పి చేశారని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే అవినీతి చిట్టాను ఆయనకు ముడుపులు చెల్లించిన వారే స్వయంగా ఆడియో, వీడియోల రూపంలో వెల్లడించారని, అయితే ఆయన ఏనాడూ వాటిని ఖండించిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. అవినీతికి పాల్పడ్డానంటూ మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తనపై వెయ్యి రాళ్లు విసిరినా ఒక్కటి కూడా తనను తాకలేదని అన్నారు. నర్సింగ్‌హోం వద్ద తాను లేనన్న విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తనపై ముద్రించిన కరపత్రాన్ని తీసుకుని అక్కడకు వచ్చి సిబ్బందికి, ప్రజలకు పంపిణీ చేయడం ద్వారా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని అన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యేను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసినప్పటికీ పోలీసుల కళ్లుగప్పి రామవరం ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆయన చర్చకు సిద్ధమని నేను ప్రకటించినప్పటికీ శుక్రవారం అనపర్తి రాలేకపోవడమేమిటని ప్రశ్నించారు.

విషయాన్ని పక్కదారి పట్టించేందుకే హైడ్రామా
అనపర్తి వస్తే ఏమి జరుగుతుందో రామకృష్ణారెడ్డికి తెలుసని, పబ్లిసిటీ స్టంట్ సృష్టించడంలో ఆరితేరిన మాజీ ఎమ్మెల్యే విషయాన్ని పక్కదారి మళ్లించేందుకు హైడ్రామా సృష్టించే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. పసలేని ఆరోపణలు చేస్తే వైఎస్సార్ సీపీ శ్రేణులు తగిన గుణపాఠం చెబుతాయని హెచ్చరించారు. రాష్ట్రంలో అన్ని సర్వే సంస్థలు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని వెల్లడిస్తున్నాయని, టీడీపీకి అనుకూలంగా పనిచేసే సర్వే సంస్థలు సైతం అనపర్తిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థే విజయం సాధిస్తారన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. రాజకీయంగా ప్రజా మద్దతును కోల్పోయిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రజల్లో సానుభూతిని పొందే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్న మాజీ ఎమ్మెల్యే కలలు కల్లలు గాక తప్పదని అన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం
మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలకు ఎమ్మెల్యే స్పందిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అనపర్తి పరిసర గ్రామాలకు చెందిన దాతలు ఇచ్చిన విరాళాలు, వాటిని ఏవిధంగా వినియోగించినది ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేగా అవినీతికి పాల్పడ్డానని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు. రాబోయే ఎన్నికలో కురుక్షేత్రంలో ప్రజలే న్యాయ నిర్ణేతలని, ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే తనపై చేసిన అవినీతి ఆరోపణలు ఖండించడంతోపాటు తనకు మద్దతు తెలియజేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జీఎస్టీ ఎగవేసిన షాపులపై కేసులు

రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సుబ్బారెడ్డి


రాజ్‌గురు స్పేర్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సుబ్బారెడ్డి


ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)/నిడదవోలు రూరల్: షాపులు నిర్వహించే యజమానులు ప్రభుత్వ నిబంధనల మేరకు జీఎస్టీ కట్టకుండా ఎగవేసినా, డొమెస్టిక్ (గృహ) గ్యాస్ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం కేవీఆర్ స్వామి రోడ్డులో గల రాజ్ గురు స్పేర్స్‌లో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్ గురు స్పేర్స్ షాపుకు సంబంధించి నాలుగు ప్రదేశాలలో స్టాక్ వెరిఫికేషన్ చేశామన్నారు. ఇందులో రూ.1,52,41,352/- విలువైన మొత్తం 10,805 వస్తువులు కనుగొనమన్నారు. కొన్ని ప్యాకేజీలపై ఎంఆర్‌పీ లేని విషయం గుర్తించామన్నారు. స్టాక్ రిజిస్టర్‌లు నిర్వహించకపోవడం గుర్తించామని, బిల్లు పుస్తకాలు, ఇన్‌వాయిస్‌ల ఫైల్‌ను స్వాధీనపరుచుకున్నారని తెలిపారు. షాపు ఐదు కేసులు నమోదు చేశారని వివరించారు. నిడదవోలు మండలం గోపవరంలోని 'టీ-కేఫ్ హోటల్'లో డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాలకు వాడడం గుర్తించామన్నారు. యజమాని దొడ్ల చిన్న మల్లయ్య పై 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారులు ముత్యాలునాయుడు, శ్రీనివాస రెడ్డి, భార్గవ మహేష్, లక్ష్మీనారాయణ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు పాల్గొన్నారు.

వేలం నిర్వహించే ఆస్తుల ప్రదర్శన


సమావేశంలో పాల్గొన్న జోనల్ మేనేజర్ సుధాకరరావు

రాజమహేంద్రవరం సిటీ: ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మార్చి నెలలో ఈ వేలం నిర్వహించే 45 ఆస్తుల వివరాల ఫొటో ప్రదర్శన ఇండియన్ బ్యాంక్ జోనల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు జోనల్ మేనేజర్ సుధాకర్‌రావు శుక్రవారం తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల జోనల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రదర్శన తిలకించేందుకు శుక్రవారం 35 మంది ఔత్సాహికులు తరలివచ్చారని, శనివారం సైతం ప్రదర్శన ఉంటుందన్నారు. ఆసక్తిగల కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రికవరీ టీం చీఫ్ మేనేజర్ దీపక్ కుమార్, జాయ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


రాహుల్ మృతదేహం

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని కోరంగి వంతెన వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బచ్చల రాహుల్(27) మృతి చెందగా, మరొక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన బచ్చల రాహుల్, సర్పవరం గ్రామానికి చెందిన అతని బంధువు బళ్ల సునీల్ ఇరువురు బైక్‌పై యానాం వెళ్లి తిరిగి వస్తుండగా కోరంగి వంతెన దిగువన ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాహుల్ తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. కొన ఊపిరితో ఉన్న రాహుల్‌ను బతికించేందుకు ఇద్దరు యువకులు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. దీంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. కాగా మరొక యువకుడు సునీల్‌కు కాలు విరిగిపోయింది. పలుచోట్ల గాయాలు కావడంతో రక్త స్రావమైంది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ప్రమాదం జరగడంతో రహదారిపై పడి ఉన్న సునీల్ రోడ్డు కాలిపోతుంది, బాధ భరించలేకున్నాను అంటూ వాపోయాడు. తనను ఆస్పత్రికి తీసుకువెళ్లండి, ఎలాగైనా బతికించండి అంటూ బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో అతన్ని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైఫ్@360

హెల్త్ టిప్స్



గుడ్డులోని తెల్లసొనను తినడం వల్ల అధిక రక్తపోటును నియంత్రించుకోవచ్చు. దీన్ని తినడం వల్ల అన్ని రకాల గుండె సమస్యలను దూరం చేస్తుంది. ఈ క్రమంలో మీరు రోజూ తినే ఆహారంలో గుడ్డును చేర్చుకోవచ్చు.



బాదం నూనెలో నిమ్మరసం కలిపి రాసుకుంటే చుండ్రు పోతుంది. ఒక గిన్నెలో కొద్దిగా బాదం నూనెను తీసుకొని.. అందులో కొద్దిగా నిమ్మ రసాన్ని మిక్స్ చేసి.. ఆ తర్వాత జుట్టుకు అప్లై చేయాలి. అలా కొద్దిసేపు చేతులతో తలపై మసాజ్ చేయాలి. మసాజ్ చేసిన తర్వాత అవసరమైతే.. గంట తర్వాత లేదా మరుసటి రోజు షాంపూతో మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల జుట్టు వేగంగా పెరుగుతుంది.



నిద్ర లేచిన తర్వాత మీకు మెడ నొప్పిగా అనిపిస్తే.. నొప్పి ప్రభావిత ప్రాంతాల్లో ఐస్ ప్యాక్ లేదే చల్లని నీటిలో నింపిన క్లాత్ ను వేసి అద్దాలి. అలా చేయడం వల్ల మెడ కండరాల వాపు తగ్గుతుంది. దీంతో పాటు హీట్ ప్యాక్ ను ఉపయోగించవచ్చు. ఇది కూడా మెడ కండరాల నొప్పిని తగ్గిస్తుంది.

మెడ నొప్పిగా ఉన్న వాళ్లు చేతులతో మెడను నెమ్మదిగా మసాజ్ చేయాలి. అలా చేయడం వల్ల కండరాలు సర్దుకొని నొప్పి తగ్గే అవకాశం ఉంది. మసాజ్ చేసే సమయంలో కొబ్బరి లేదా నువ్వుల నూనె ఉపయోగిస్తే మేలు జరుగుతోంది. మెడ నొప్పిని నివారించేందుకు మీరు రాత్రిళ్లు బోర్లా పడుకోకుండా ఉంటే చాలు.



మంచి అలవాట్లు మెరుగైన ఆరోగ్యం

మంచి అలవాట్లు మన జీవితాలను మెరుగుపరుస్తాయి అని స్టీఫెన్ కోవీ తన '7 హ్యాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్'లో చెప్పాడు. అదే సూత్రం ఆరోగ్యానికి కూడా వర్తిస్తుంది. ఆరోగ్యకరమైన అలవాట్లు జీవనశైలి మన ఆరోగ్యాన్ని, శక్తి స్థాయులని, పని చేసే సామర్థ్యాన్ని మెరుగుపరచడంతోపాటు జీవన శైలి వ్యాధులను నివారించడంలో కూడా తోడ్పడతాయి. ఇంతకీ ఆ అలవాట్లేమిటో తెలుసుకుందామా... ఎవరినైనా సరే, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే కొన్ని అలవాట్లు...

రోజును ముందుగానే ప్రారంభించటం...

తొందరగా నిద్ర లేవాలి, తొందరగా నిద్రపోవాలి అనే సూత్రాన్ని చాలామంది పాటిస్తుంటారు. అయితే ఈ సూత్రాన్ని పని చేసే రోజుల్లోనే అంటే వర్కింగ్ డేస్‌లో మాత్రమే పాటిస్తూ, సెలవ రోజుల్లో పక్కన పెట్టేస్తారు. అలా కాకుండా వారాంతాల్లోనూ, సెలవు రోజుల్లో కూడా సాధ్యమైనంత వరకు త్వరగా నిద్రలేచి త్వరగా మన దినచర్యను ప్రారంభించే అలవాటు స్వీయ క్రమశిక్షణకు చిహ్నం. అంతేకాదు, తొందరగా నిద్రలేవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతారని అనేక పరిశోధనల్లో రుజువైంది కూడా.

సముద్రపు ఉప్పుకు మారండి

చిప్స్, బర్గర్‌ల నుండి వేపుళ్ల వరకు ప్రతిదీ ఉప్పుతో నిండి ఉంటుంది. వాటిని చాలా రుచికరమైనదిగా చేస్తుంది. మీ ఆహారంలో ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల రక్తపోటు, మూత్రపిండాల్లో రాళ్లు, డీహైడ్రేషన్, హైపర్‌టెన్షన్, కడుపు క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అందువల్ల అయోడైజ్డ్ సాల్ట్‌కు బదులు సముద్రపు ఉప్పు, రాక్ సాల్ట్ లేదా హిమాలయన్ పింక్ సాల్ట్‌కి మారండి. ఇవి ఆరోగ్యకరమైనవి.

శుద్ధి చేసిన చక్కెరకు నో చెప్పండి

చక్కెరలో ఎటువంటి పోషకాలు లేవు. ఎందుకంటే ఇది ప్రాసెసింగ్ ద్వారా వెళుతుంది. ప్రాసెస్ చేసిన చక్కెరను అధికంగా తీసుకోవడం వల్ల మీ శరీరంలోని ముఖ్యమైన పోషకాలు క్షీణించడం ప్రారంభిస్తాయి. బదులుగా మినరల్ షుగర్, పామ్ షుగర్, బెల్లం లేదా తేనెకు మారడం మంచిది.

ఆరోగ్యకరమైన అల్పాహారం

అల్పాహారం తీసుకోవడం అనేది రోజులో అత్యంత ముఖ్యమైన విషయం.. మీకు ఉదయం సమయం లేకపోతే, ఏవైనా పండ్లు లేదా కొన్ని గింజలను అయినా తీసుకోవచ్చు. ఆ తర్వాత పనిలో తినగలిగే అల్పాహారాన్ని ప్యాక్ చేసుకుని తీసుకెళ్లి తినాలి. అంతేకానీ, మొత్తంగా బ్రేక్ ఫాస్ట్‌ను బ్రేక్ చేయద్దు.

కనీస వ్యాయామం

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయలేరు. కానీ ఫిట్‌గా ఉండటానికి ట్రిక్ యాక్టివ్‌గా ఉండటమే. ఫిట్‌గా ఉండేందుకు రోజుకు పదివేల అడుగులు వేయడం సరైనదని పరిశోధనలు చెబుతున్నాయి. మన కదలికలు తగినంతగా లేకపోతే, మనలో చురుకుదనం లోపిస్తుంది. కొవ్వు పేరుకునిపోతుంది. అందువల్ల భోజనం చేసిన తర్వాత కొద్దిసేపు నడిచేందుకు ప్రయత్నించండి. అదేవిధంగా తక్కువ దూరాలను చేరుకునేందుకు వాహనాలను ఉపయోగించడానికి బదులు నడిచి వెళ్లే అలవాటు చేసుకోవడం మంచిది.

మంచి నిద్ర

శరీర సాధారణ పనితీరును, నాడీ వ్యవస్థను పునరుద్ధరించడానికి సహాయపడేవాటిలో నిద్ర కీలకమైనది.. నిద్ర లేకపోవడం వల్ల జీవనశైలిని నేరుగా ప్రభావితం చేసే మగత, అలసట, ఏకాగ్రత కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నిద్ర లేమి మెదడుపై నియంత్రణను కోల్పోయేలా చేస్తుంది. అందువల్ల రోజూ కనీసం 6 నుంచి 8 గంటల నిద్ర పోవడం అవసరం. ఒక వేళ మీకు నిద్ర పట్టని సమస్య ఉంటే, ఏదైనా పుస్తకాన్ని చదవడం, చక్కటి సంగీతాన్ని వినడం, ధ్యానం చేయడం ద్వారా నిద్రపోయేందుకు ప్రయత్నించాలి. అప్పటికీ ఫలితం లేకపోతే వైద్య సహాయం తీసుకోవాలి.

నవ్వుతూ ఉండటం

మిమ్మల్ని మీరు పాజిటివ్ వైబ్స్‌తో నింపుకోవడానికి ఇదే సులభమైన పద్ధతి. నవ్వు లేని జీవితం శూన్యం. నవ్వు ఎండార్ఫిన్‌ల విడుదలను ప్రేరేపిస్తుంది. ఇది మానసిక స్థితిని పెంచుతుంది. ఒత్తిడి, ఆందోళన నిరాశను తగ్గిస్తుంది. అందుకే నవ్వండి, ఆరోగ్యంగా ఉండండి!

ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం

రోజువారీ ఆహారంలో వివిధ రకాలైన పండ్లు, ఆకు కూరలు, మొలకలు, పప్పులు, మాంసం, పౌల్ట్రీ ఫుడ్, సీ ఫుడ్ ఉండాలి. మీ ఆహారంలో ప్రొటీన్లు, ఫైబర్లు, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగానూ, కార్బోహైడ్రేట్లు, క్యాలరీలు తక్కువగానూ ఉండేలా చూసుకోవాలి. అలాగే, మీరు మీ ఆహారాన్ని ఎలా తింటారు లేదా నమలాలి అనేది కూడా ముఖ్యమైన భాగం. ఆహారం జీర్ణం కావాలంటే 20–30 సార్లు నమలాలి.

బాగా నీరు తాగడం

మన శరీరంలోని ప్రతి కణం, కణజాలం, ప్రతి అవయవానికి అవసరమైన మొత్తంలో నీరు తాగటం అవసరం. ఇతర పానీయాల కంటే తాగునీరు ఎల్లప్పుడూ మంచి ఎంపిక. హైడ్రేటెడ్ గా ఉండటానికి మీతో ఒక చిన్న వాటర్ బాటిల్ ఉంచుకోవడం అవసరం. ప్రతి అరగంటకు ఒకసారి కొన్ని గుక్కల నీరు తాగడం మంచిది.

టీ/కాఫీ తీసుకోవడం తగ్గించండి

పనిలో అనేక కప్పుల ప్రాసెస్ చేయబడిన కెఫిన్ తీసుకోవడం అనారోగ్యకరమైన అలవాట్లలో ఒకటి. మిల్క్ పౌడర్, పంచదార, పైగా ఉడికించిన టీ, రెడీ మిక్స్ కాఫీ, అన్నీ క్యాలరీలతో నిండి ఉన్నాయి. అందువల్ల పూర్తిగా మానేయనక్కర లేదు కానీ పరిమితంగా తీసుకోవడం మంచిది.

పరిశుభ్రత పాటించడం

నోటిని శుభ్రంగా ఉంచుకోవడం, క్రమం తప్పకుండా స్నానం చేయడం, ఇంటిని, వంటిని, పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి చిన్న అలవాట్లు ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మీ సామాజిక జీవితాన్ని కూడా మెరుగుపరుస్తాయి.

బార్లీతో బోలెడన్ని సమస్యలు దూరం

వేసవి వచ్చేసింది... వేడితో అనేక సమస్యలు ఎదురవుతాయి. అన్నం తినాలనిపించదు. తినకపోతే ఆకలి. డీహైడ్రేషన్ సమస్యలు తప్పవు. అయితే వేసవిలో ముడిపడి ఉండే ఇటువంటి సమస్యలకు బార్లీనీళ్లతో చెక్ పెట్టొచ్చు. కేవలం వేసవి సమస్యలకే కాదు... అనేక ఆరోగ్య సమస్యలకు బార్లీ బాగా పని చేస్తుంది. అదెలాగో చూద్దాం...

పూర్వం ఎవరికైనా జ్వరం వచ్చిందంటే నీరసం నుంచి కోలుకోవడానికి బార్లీ నీళ్లు, సగ్గుజావ తాగించేవాళ్లు పెద్దలు. ఇప్పుడు కూడా బార్లీ కనిపిస్తోంది కానీ, అక్కడక్కడా... అప్పుడప్పుడూ మాత్రమే. కేవలం జ్వరంలోనే కాదు, వేసవిలో బార్లీ వాడకం చాలా మంచిది. అదెలాగో చూద్దాం...



➡ వేసవిలో తిన్నది అరగక పోవడం సాధారణ సమస్య. అలాంటప్పుడు బార్లీ నీళ్లు తాగితే చాలా మంచిది. జీర్ణాశయం కూడా చాలా శుభ్రపడుతుంది. అజీర్తి దూరమవుతుంది ➡ పిల్లలకు బార్లీ నీళ్లు తాగిస్తే మంచి ఫలితం ఉంటుంది. మలబద్ధకం వంటి సమస్యలు దరి చేరవు. ఎండల ప్రభావం పడకుండా ఉండాలన్నా, వడదెబ్బ తగలకుండా ఉండాలన్న ఈ నీళ్లు తాగాల్సిందే ➡ మధుమేహులకు కూడా బార్లీ చాలా మేలు చేస్తుంది. రక్తంలోని చక్కెర స్థాయులను అదుపులో ఉంచుతుంది. ఇన్సులిన్ కూడా అదుపులోనే ఉంటుంది ➡ ఇక గర్భిణులు రోజూ బార్లీనీళ్లు తాగితే మరీ మంచిది. కాళ్ల వాపు సమస్య వారి దరిచేరదు. రోజులో ఉదయం, సాయంత్రం బార్లీ నీళ్లు తాగితే బిడ్డ ఆరోగ్యం కూడా బాగుంటుంది. అలసట కూడా త్వరగా రాదు ➡ బరువు తగ్గాలనుకునే వారికి కూడా బార్లీ నీళ్లు బాగా ఉపయోగపడతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గిస్తాయి. దీని ద్వారా గుండె సంబంధిత వ్యాధులు దూరంగా ఉంటాయి. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి ➡ మహిళలను తరచూ బాధించే ప్రధాన సమస్య మూత్రనాళ ఇన్ఫెక్షన్. ఈ సమస్యను దూరం చేసుకోవాలంటే ఉదయాన రోజూ గ్లాసుడు బార్లీ నీళ్లు తాగితే మంచి ఫలితం ఉంటుంది. మూత్రంలో ఇన్ఫెక్షన్లు కలిగే కారకాలు, వ్యర్థాలు బయటికి పోతాయి. సూక్ష్మమైన రాళ్లు కూడా కరిగిపోతాయి.

సినిమా

ధ్రువ్‌కు జోడీగా..?


● అనుపమా పరమేశ్వరన్

తమిళ స్టార్ హీరో విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్, హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ జోడీగా కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ధ్రువ్ విక్రమ్ హీరోగా మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామా తెరకెక్కనుంది. కబడ్డీ ప్లేయర్ మానతీ గణేశన్ జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు అనుపమా పరమేశ్వరన్‌ను తీసుకున్నారట. అనుపమాకి ఇటీవల మారి సెల్వరాజ్ ఈ కథను వినిపించగా, ఈ బ్యూటీ ఆల్మోస్ట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ టాక్. మరి.. ధ్రువ్ విక్రమ్‌కు జోడీగా అనుపమా పరమేశ్వరన్ కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక ఈ సినిమా చిత్రీకరణ ఈ నెల 15న తమిళనాడులోని తూత్తుకూడిలో ప్రారంభం కానుందని సమాచారం.

జస్ట్ సూపర్ మేన్.. అంతే!

"కథ రాయడం మొదలుపెట్టి, తొలి డ్రాఫ్ట్ పూర్తి చేసేవరకూ నా సినిమాకు 'సూపర్‌మేన్: లెగసీ' అనే టైటిల్‌నే అనుకున్నాను. కానీ ఫైనల్ డ్రాఫ్ట్ పూర్తి చేశాక 'లెగసీ'ని వదిలేద్దామని నిర్ణయించుకున్నాను. ఇప్పుడు నా సినిమా టైటిల్ జస్ట్ 'సూపర్‌మేన్'... అంతే. మా ఈ సూపర్‌మేన్ వచ్చే ఏడాది జూలై 11న మీ ముందుకు వస్తాడు'' అని సామాజిక మాధ్యమాల ద్వారా దర్శకుడు జేమ్స్ గన్ పేర్కొన్నారు. సూపర్‌మేన్ క్యారెక్టర్‌తో ఇప్పటివరకూ 'సూపర్‌మేన్' ఫ్రాంచైజీలను నిర్మించిన డీసీ స్టూడియోస్ తాజా సూపర్‌మేన్ చిత్రాన్ని నిర్మించనుంది. అయితే సూపర్‌మేన్‌ని కొత్త రకంగా చూపించనున్నారు జేమ్స్ గన్. ఇప్పటివరకూ వచ్చిన చిత్రాల్లో సూపర్‌మేన్ ధరించిన సూట్‌కి భిన్నంగా తాజా చిత్రంలోని సూపర్‌మేన్ సూట్ ఉంటుందట. కాగా ఈ మధ్యకాలంలో సూపర్‌మేన్ అంటే నటుడు హెన్రీ కవిల్ గుర్తొస్తారు. 2013 నుంచి 2021 వరకూ డీసీ స్టూడియోస్ నిర్మించిన సూపర్‌మేన్ చిత్రాల్లో టైటిల్ రోల్‌లో అద్భుతంగా ఒదిగిపోయారు హెన్రీ. కానీ, తాజా చిత్రంలో ఈ పాత్రను డేవిడ్ కోరెన్స్‌వెట్ చేయనున్నారు. "సూపర్‌మేన్ జీవితంలోని పూర్వ భాగంపై ఈ చిత్రం ఉంటుంది. ఈ పాత్రను హెన్రీ కవిల్ చేయలేదు. అందుకే డేవిడ్ కోరెన్స్‌వెట్‌ని తీసుకున్నాం'' అని జేమ్స్ గన్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... ఇప్పటి వరకూ మూడు నాలుగు చిత్రాల్లో మాత్రమే నటించిన 30 ఏళ్ల డేవిడ్ కోరెన్స్‌వెట్‌కి 'సూపర్‌మేన్' చాన్స్ రావడం అనేది గొప్ప విషయం అని హాలీవుడ్ అంటోంది.


● డేవిడ్ కోరెన్స్‌వెట్

కాశీలో క్లాప్


● తమన్నా, సంపత్ నంది

ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్టశక్తుల నుంచి ఏ విధంగా రక్షిస్తాడు? అనే ప్రధాన ఇతివృత్తంతో తెరకెక్కుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'ఓదెల 2'. 2022లో డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. ఇందులో తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ట ఎన్. సింహా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ పై డి. మధు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు సంపత్ నంది క్రియేటర్‌గా ఉన్న ఈ సినిమా ప్రారంభోత్సవం కాశీలో జరిగింది. రెగ్యులర్ షూటింగ్‌ని కూడా కాశీలోనే ఆరంభించారు. తొలి సీన్‌కి సంపత్ నంది క్లాప్ కొట్టారు. "ఓదెల 2' గ్రామం చుట్టూ కేంద్రీకృతమై, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా రక్షిస్తాడనే అంశాలతో ఈ చిత్రకథ ఉంటుంది. క్యాస్టింగ్, కథ, వీఎఫ్ఎక్స్.. టోటల్‌గా మేకింగ్ పరంగా ఈ చిత్రం పెద్దగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్. ఎస్.

కొత్త పాయింట్‌తో తీశారనిపిస్తోంది

- రాజేంద్ర ప్రసాద్

విశ్వ కార్తికేయ, ఆయూషీ పటేల్ జంటగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో..'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డా. కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– "కలియుగం పట్టణంలో..' టైటిల్ కొత్తగా ఉంది. కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రాబోతోందని అర్థం అవుతోంది. నా 'ఆ నలుగురు' సినిమాలో అప్పడాలు అమ్మి పెట్టడంలో నా గురువుగా ఆరేళ్ల వయసులోనే విశ్వ కార్తికేయ నాతో పాటు నటించాడు. ఇప్పుడు హీరోగా నటించాడు. ప్రేక్షకులు ఈ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలి. ప్రస్తుతం ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' సినిమాలో ఓ రోల్ చేస్తున్నాను'' అన్నారు. "మదర్ సెంటిమెంట్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌ను మిక్స్ చేసి ఈ సినిమా తీశారు. చిత్రా శుక్లా ఓ స్పెషల్ రోల్ చేశారు'' అన్నారు విశ్వ కార్తికేయ. "మా చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు రమాకాంత్ రెడ్డి. "మా టీజర్, ట్రైలర్‌ను చూసి కథను అంచనా వేయలేరు. సినిమా అంత కొత్తగా ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణను కడపలోనే చేశాం'' అన్నారు కందుల చంద్ర ఓబుల్ రెడ్డి. "సినిమా అంతా కడపలోనే తీయడం ఇదే తొలిసారి. కడప నుంచి ఓ మంచి నిర్మాత రాబోతున్నాడు'' అన్నారు దర్శకుడు నీలకంఠ.


● ఆయూషీ పటేల్, రాజేంద్ర ప్రసాద్, విశ్వ కార్తికేయ

ఎనిమిది భాషల్లో రికార్డు బ్రేక్

నిహార్, నాగార్జున, రగ్గా ఇఫ్తాకర్, సత్యకృష్ణ, కాశీ విశ్వనాథ్ ముఖ్య తారలుగా చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ పై చదలవాడ పద్మావతి నిర్మించిన చిత్రం 'రికార్డు బ్రేక్'. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో 8 భాషల్లో విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'మళ్లీ పుట్టి వచ్చినవా..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. సాబు వర్గీస్ సంగీత సారథ్యంలో వరికుప్పల యాదగిరి ఈ పాటకు లిరిక్స్ అందించి, పాడారు. "అందరికీ నచ్చేలా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు చదలవాడ శ్రీనివాసరావు.


● కాశీ విశ్వనాథ్, చదలవాడ శ్రీనివాసరావు